నీళ్లు రావు.. వసతులు లేవు..

'మీతో సాక్షి' కార్యక్రమంలో సమస్యల వెల్లువ

- మంచినీటి సమస్యతో అవస్థలు పడుతున్న ఇందిరానెహ్రూనగర్ కాలనీ వాసులు
- బస్తీల్లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన







'మీతో సాక్షి' కార్యక్రమంలో సమస్యలు తెలుపుతున్న ప్రజలు



సమస్యలను వివరిస్తున్న బీహారీ బస్తీ వాసులు

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్, బీహారీబస్తీ, జేఎల్ఎస్ఏస్‌నగర్, హిల్‌టాప్ కాలనీ, రామాంజనేయనగర్, న్యూ వెంకటేశ్వరనగర్ తదితర కాలనీల ప్రజలు మంచినీటి సమస్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఇందిరానెహ్రూనగర్, బీహారీబస్తీల్లో 'మీతో సాక్షి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల మహిళలు, ప్రజలు మంచినీటి సమస్యతోపాటు కరెంట్ కష్టాలు, రేషన్ కార్డులు, పెన్షన్, కాలనీల్లో అంతర్గత రహదారులపై గళమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ సమస్య లేదని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మంచినీటి కష్టాలతోపాటు మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. 'మీతో సాక్షి' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకునే ప్రయత్నం చేసింది.

వారానికి ఒకసారి మంచినీళ్లు..

◆ 1978లో ఇందిరాగాంధీ, చాచానెహ్రూ పేర్లతో కలిపి ఇందిరానెహ్రూనగర్ కాలనీ ఏర్పడింది. కాలనీలో 66 గల్లీలు ఉన్నాయి. 20 వేల జనాభా ఉన్న ఇందిరా నెహ్రూనగర్ కాలనీలో దినసరి కూలీలుగా పని చేస్తున్న వారే ఎక్కువగా నివాసం ఉంటున్నారు. ఎత్తైన ప్రాంతంలో ఉన్న ఈ కాలనీలో గత కొన్ని నెలలుగా నెలలుగా మంచినీటి సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మహేంద్రహిల్స్ రిజర్వాయర్ నుంచి ఇందిరానెహ్రూనగర్, జేఎల్ఎస్ఎస్‌నగర్, హిల్‌టాప్ కాలనీ, న్యూ వెంకటేశ్వరనగర్, రామాంజనేయనగర్‌తో పాటు పలు కాలనీలకు మంచినీటి సరఫరా జరుగుతుంది. గత కొంత కాలంగా వారానికోసారి మాత్రమే నీళ్లు విడుదల చేస్తుండటంతో ఆయా కాలనీల ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు కరెంటు కోతలు, రేషన్ కార్డుల సమస్యతోపాటు కొత్త పెన్షన్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కాలనీలకు రోడ్డు మార్గం లేకపోవడంతో అత్యవసర వాహనాలు సైతం రాలేని పరిస్థితి.

నీళ్లు రావడం లేదు



ఇందిరానెహ్రూనగర్ బీహారీ బస్తీతో పాటు పలు కాలనీలకు మహేంద్రహిల్స్‌లోని రిజర్వాయర్ నుండి మంచినీటి సరఫరా జరుగుతుంది. దినం తప్పి దినం నీరు సరఫరా కావాలి. కాని గత కొంతకాలంగా వారానికోసారి నీటి సరఫరా జరుగుతుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

– అనిత, ఇందిరా నెహ్రూనగర్ కాలనీ

రేషన్ కార్డులు లేవు..



ఇందిరానెహ్రూనగర్ కాలనీలో అధిక శాతం పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలు నివాసం ఉంటున్నారు. వారిలో చాలా మందికి రేషన్ కార్డులు లేక అవస్థలు పడుతున్నారు. పెన్షన్ అందడం లేదు. కరెంట్ కోతలతో ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి రేషన్ కార్డులు ఇప్పించాలి

– లక్ష్మి, ఇందిరానెహ్రూనగర్

రోడ్డు వసతి కల్పించాలి



దశాబ్దంగా ఇందిరానెహ్రూనగర్ కాలనీకి సరైన రోడ్డు మార్గం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అత్యవసరమైన 108, ఫైరింజన్ వంటి వాహనాలు రావడానికి ఇబ్బందిగా ఉంది.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– రమేష్ , ఇందిరానెహ్రూనగర్

వైభవంగా జయగిరి లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌లోని శ్రీజయగిరి లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయంలో స్వాతి నక్షత్రం సందర్భంగా శుక్రవారం స్వామివారి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీర్వచనాలు పొందారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, ప్రధాన అర్చకులు రఘుకిరణాచార్యులు, బ్రాహ్మణ శివవాహిని కమిటీ సభ్యులు వెంకటేష్‌శర్మ, హరి, అంజనేయ అభిషేక్‌శర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి : వినాయక్‌నగర్ డివిజన్ ఎన్‌బీహెచ్ కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ సత్యలక్ష్మీ, సూపర్ వైజర్ వెంకటేష్, లక్కి, కాలనీ అధ్యక్షుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్



మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

గౌతంనగర్: గురుకుల పాఠశాలలో కల్తీ ఆహారం కారణంగా విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడంపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ మల్కాజిగిరి నియోజకవర్గ ఆధ్వర్యంలో మాసబ్‌ట్యాంక్‌లోని బీసీ భవన్‌లో మెమొరాండం ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ నేపథ్యంలో శుక్రవారం బీజేపీ నాయకులను మల్కాజిగిరి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టైన వారిలో బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, రామకృష్ణ, గణ, భరత్, పెంటయ్య తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



గౌతంనగర్‌లో చండీ హోమం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు మాశెట్టి అనిల్

గౌతంనగర్: లోక కళ్యాణార్థం కార్తీకమాసాన్ని పురస్కరించుకుని గౌతంనగర్‌కు చెందిన బీజేపీ నాయకులు మాశెట్టి అనిల్ నివాసంలో శుక్రవారం చండీ హోమం, సుదర్శన హోమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక నాయకులు, కాలనీవాసులు హాజరై పూజలు చేశారు.

పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

రామంతాపూర్ : డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసి డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

రామంతాపూర్: ఇందిరానగర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి శుక్రవారాన్నిపురస్కరించుకుని వేద పండితులు ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్య ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తే కుటుంబంలో అన్ని శుభాలే జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయభారతి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్న దృశ్యం

దివ్యాంగుల పెన్షన్ రూ. 6 వేలకు పెంచాలి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న సుల్తాన్ రమేష్

మల్కాజిగిరి: దివ్యాంగుల పించన్ మొత్తాన్ని రూ 6వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుల్తాన్ రమేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మల్కాజిగిరి సర్కిల్ డీసీ రాజుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం సుల్తాన్ రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ లో ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్‌ను రూ. 6 వేలకు పెంచాలన్నారు. 2014 లో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయపరిమితి విధిస్తూ విడుదల చేసిన జీవో 17ను రద్దు చేయాలన్నారు. 2015 తర్వాతే సదరం సర్టిఫికెట్ ఆన్‌లైన్ ద్వారా తీసుకునే వెసలుబాటు ఉందని, అంతకు ముందు ఇచ్చిన సర్టిఫికెట్లను ఆన్‌లైన్ చేయాలన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు , ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతి నెలా 5లోగా పింఛన్లు పంపిణీ చేయడమే కాకుండా, కొత్తగా అమలు చేస్తున్న మహిళాశక్తి క్యాంటీన్ పథకంలో దివ్యాంగులకు 5 శాతం కేటాయించాలన్నారు. జాతీయ కమిటీ పిలుపు మేరకు డిసెంబర్ 9వరకు దశలవారీగా ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. డీసీని కలిసిన వారిలో వీరప్ప, సత్యనారాయణ, మోసెస్ తదితరులు ఉన్నారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బోడుప్పల్ బీఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న 19వ డివిజన్ ఈస్ట్ బృందావన్ కాలనీకి చెందిన సిద్దేశ్వర్ వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన సీఎం రిలీఫ్ పండ్‌ను చెక్కును శుక్రవారం కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి అభాగ్యులకు ఆపన్న హస్తం లాంటిదన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో 19వ డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ విశ్వనాథ్, నేతలు కొత్త రవిగౌడ్, కాటపల్లి రాంచంద్రారెడ్డి, మీసాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయండి



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు మొక్కను అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గంలో నాలాల అభివృద్ధి, ఎస్ఎన్‌డీపీ కింద చేపట్టే పనులకు నిధులు విడుదల చేయాలని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి చర్చించారు. అంతకు ముందు కమిషనర్‌ను శాలువాతో సత్కరించి మొక్క అందజేశారు. నియోజకవర్గంలో రూ.101 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు చేతులు మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రశాంత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రశాంత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉప్పల్: ఉప్పల్ ప్రశాంత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డా.ఎస్ విజయ మోహన్, ఉపాధ్యక్షుడిగా పి.ముత్యం రెడ్డి, కార్యదర్శిగా ఎల్ కృష్ణ స్వామి, సంయుక్త కార్యదర్శులుగా సాంబిరెడ్డి, సుబ్బారెడ్డి, కోశాధికారిగా ప్రవీణ్ మోముల, నాగేశ్వర్‌రావు జాయింట్ ట్రెజరర్‌గా నాగేశ్వర్ రావు ఎన్నికయ్యారు. సభ్యులుగా మర్రి విజయలక్ష్మీ, కె. లక్ష్మీ, మహ్మద్ ఖుత్బుద్దీన్, శ్రీకాంత్ శర్మలను ఎన్నుకున్నారు. కాలనీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది.

మహిళ అదృశ్యం



సునీతా దేవి (ఫైల్)

కుషాయిగూడ: బతుకుదెరువు కోసం వచ్చిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన శుక్రవారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జార్ఖండ్‌కు చెందిన సునీతా దేవి(42) నాలుగు రోజుల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి తన తమ్ముడితో కలిసి చర్లపల్లిలో నివాసం ఉంటోంది. గురువారం ఉదయం చర్లపల్లి ఫేజ్–2లో పని కోసం వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన సోదరుడు ఆమె కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

మేడిపల్లి: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ చక్రపాణి అన్నారు. శుక్రవారం మేడిపల్లి పోలీసుల ఆధ్వర్యంలో మహాత్మజ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు బానిసలైతే భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు. విద్యాసంస్థల నిర్వాహకులు తమ విద్యార్థుల కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు.కార్యక్రమంలో మేడిపల్లి సీఐ గోవిందరెడ్డి, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఏసీపీ చక్రపాణి తదితరులు

రూ. 2.25కోట్లతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేయర్ అమర్ సింగ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 4,9,19,21,26 డివిజన్లలో రూ.2.25 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం మేయర్ అమర్ సింగ్ పనులను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, డిప్యూటి మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు దయాకర్ రెడ్డి, తుంగతుర్తి రవి, మున్సిపల్ కమిషనర్ రఘు, డీఈ సాయినాథ్ గౌడ్, కార్పొరేటర్లు భీంరెడ్డి నవీన్ రెడ్డి, కొడె పోచయ్య, అనంత రెడ్డి, బచ్చరాజు, పిట్టల మల్లేష్, మద్ది యుగేందర్ రెడ్డి, పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి, అలువాల సరిత,యాసారం మహేశ్వరి, కేతావత్ శుభాష్ నాయక్,నాయకులు బోడిగె కృష్ణ గౌడ్,ఈశ్వర్ రెడ్డి, మాదుగుల చంద్రా రెడ్డి,బండారి రవీందర్, కుర్ర శ్రీకాంత్ గౌడ్, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: 11కేవీ చెంగిచెర్ల ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమతుల కారణంగా 33/11కేవీ పీఅండ్‌టీ కాలనీ పరిధిలో శనివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.00గంటల వరకు పీఅండ్‌టీ కాలనీ, విశ్వంవిహార్ కాలనీ, వెస్ట్ కమలానగర్, సుమ రెసిడెన్సీ, గురుఎన్‌క్లేవ్,అయోధ్యకాలనీ,భరత్ సింగ్ నగర్, కమలానగర్, ఎస్వీకాలనీ, ధరణి కాలనీ, సుదర్శన్ నగర్, సాయి నగర్ ఈస్ట్ బాపూజీ నగర్, వరంగల్ హైవే ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ హరినాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మాలల సింహగర్జన పోస్టర్ ఆవిష్కరణ



మల్లాపూర్: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో డిసెంబర్ 1న నిర్వహించనున్న 'హలో మాల చలో హైదరాబాద్' మాలల సింహగర్జన పోస్టర్‌ను శుక్రవారం నాచారం అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక నాయకులు ఆవిష్కరించారు. కార్య క్రమంలో భూపతి గణేష్, బందరి రఘు, సుధాకర్, క్రాంతి, కిషోర్, నరేష్, సుమన్, హరీష్, శేఖర్, చందు, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ లేనిదే తెలంగాణ లేదు

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి
- జేఏసీ వెంకన్న ఆధ్వర్యంలో సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

మల్కాజిగిరి: కేసీఆర్ లేనిది తెలంగాణ లేదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ తెలంగాణ కోసం దీక్ష చేపట్టి 15 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శుక్రవారం మల్కాజిగిరి చౌరస్తాలో అప్పటి జేఏసీ చైర్మన్ వెంకన్న ఆధ్వర్యంలో దీక్షా దివస్ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా తెలంగాణ ఏర్పాటు ఘనత కేసీఆర్‌దేనన్నారు. నాటి కేసీఆర్ దీక్ష వేల మంది ఉద్యమకారులను తయారు చేసిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో దుండిగల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి ర్యాలీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మీనా ఉపేందర్‌రెడ్డి, సునీతారాముయాదవ్,నాయకులు జగదీష్‌గౌడ్, పరశురామిరెడ్డి, ఉపేందర్, బాబారావు, నర్సింగ్‌మాదిగ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను మలుపు తిప్పిన రోజు

మల్లాపూర్: సమైక్య రాష్ట్ర సంకెళ్లను తెంచి తల్లి తెలంగాణ విముక్తి కోసం కేసీఆర్ 2009 నవంబర్ 29న ఆమరణ దీక్ష చేపట్టి చరిత్రను మలుపు తిప్పారని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్, నాచారం డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌కు తరలిన నేతలు

గౌతంనగర్: దుండిగల్ చేపట్టిన దీక్షా దివస్ కార్యక్రమానికి కార్పొరేటర్ మేకల సునీతరాము యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయినగర్ చౌరస్తా నుండి బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన ఉద్యమంలో మలుపు తిప్పిన రోజుగా అభివర్ణించారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, స్థానిక నాయకులు, మహిళా నేతలు పాల్గొన్నారు.



నాచారం నేతలు సాయిజెన్‌శేఖర్ తదితరులు



దీక్షా దివస్‌లో పాల్గొన్న కార్పొరేటర్ సునీత



మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి